ప్రజాశక్తి
గురువారం 27 జులై 2023
5
అల్లూరి సీతారామరాజు

80 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -జి.మాడుగుల: మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం జంక్షన్ వద్ద మంగళవారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా 80 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని స్థానిక ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. గంజాయి కారులో నలుగురు ఉండగా, ఇద్దరు పరారయ్యారని పేర్కొన్నారు. మిగతా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. గంజాయితో పాటు కారు, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కి తరలించినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

పట్టుబడిన నిందితులతో పోలీసులు

ప్రమాద స్థాయిలో గోదావరి వరద ఉధృతి

- 46.2 అడుగులకు చేరిన నీటి మట్టం
- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- ఇంకా పెరిగే అవకాశం
- 32 అడుగులకు చేరిన శబరి
- ముంపు మండలాలకు పొంచి ఉన్న ప్రమాదం

చింతూరు మండలం కొయగురు వాగు పొంగి రోడ్డుపై ప్రవహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-చింతూరు

గోదావరి వరద నీటి ప్రవాహం మళ్లీ పెరిగింది. 10,12,804 క్యూసెక్కుల వరద నీరు గోదావరిలోకి వచ్చి చేరుతోంది. భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం మంగళవారం 38.1 అడుగులు ఉండగా, బుధవారం సాయంత్రానికి 46.2 అడుగులకు చేరింది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. నీటి ప్రవాహం గణనీయంగా పెరిగిన నేపథ్యంలో గోదావరి నీటి మట్టం 48 అడుగులకు చేరుకుంటే రెండవ ప్రమాద హెచ్చరికను, 53 అడుగులకు పెరిగితే మూడో ప్రమాదక హెచ్చరికను జారీ చేస్తామని సిడబ్ల్యుఎస్ అధికారులు తెలిపారు. మరో వైపు చింతూరు వద్ద శబరి నది నీటి మట్టం కూడా పెరిగింది. మంగళవారం 26 అడుగులున్న శబరి నీటి మట్టం బుధవారం సాయంత్రానికి క్రమంగా పెరుగుతూ 32 అడుగులకు చేరింది. దీనికి తోడు ఉపరితల ఆవర్తనం కారణంగా చింతూరు ఏజెన్సీలో గత 24 గంటల నుండి కుండ పోత వర్షం కురుస్తోంది. దీంతో మండలంలోని సోకిలేరు, చంద్రవంక, కొయగురు, చీకటి వాగు తదితర వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. రహదారులను మూసుకుపోయాయి. కొయగూరు వాగు రోడ్డుపై ప్రవహించడంతో ఆంధ్ర -ఒడిశా రహదారులు స్తంభించాయి. కొమ్మూరు వద్ద చంద్రవంక వాగు పొంగి ప్రవహించడంతో కొమ్మూరు-మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. సోకిలేరు వాగు ప్రవాహం వల్ల విఆర్.పురం, చింతూరు మండలాలకు సంబంధాలు తెగిపోయాయి. బుధవారం చింతూరు మండల కేంద్రంలో వారపు సంత జనం లేక వెలవెల పోయింది. కొయగూరు వాగు దాటుతున్న తెలంగాణ ఆర్టీసీ బస్సు వరద నీటిలో చిక్కుకోగా స్థానికుల సహాయంతో బయటకు తీశారు. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వరద ఇంకా ప్రమాద స్థాయిలో వచ్చే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చింతూరు పంచాయతీ అధికారులు మైకుల ద్వారా హెచ్చరికలు చేశారు.

ఎటపాక : గోదావరి వరద ఉధృతి పెరుగుతుండడంతో పరివాహక ప్రాంతం ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే వరద ప్రవాహం కారణంగా మురుమూరుకు, భద్రాచలం - కూనవరం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి నీటి మట్టం 48 అడుగులకు చేరితే పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. ఎగువన ఉన్న ప్రాజెక్టులు నుండి విడుదల చేస్తున్న వరద నీరు భారీగా వచ్చి గోదావరి నదిలో చేరుతుందని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. మరో వైపు గత రెండు రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలతో చెరువులు, కుంటలు నిండు కుండలా మారాయి. వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని మిగిలిన ప్రాంతాల్లో వారం రోజుల వరకు చెరువులలో నీళ్లు లేక ఈ ఏడాది వరి పండించగలమో లేదో అనే సందిగ్ధంలో ఉన్న రైతన్నలు చెరువులు అలుగు పారుతుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న తహశీల్దారు

విఆర్.పురం : కూనవరం వద్ద శబరి నీటి మట్టం 36.88 అడుగులకు చేరింది. గోదావరి వరద పెరుగుతుండడంతో ప్రజలు భయం గుప్పెట్లో ఉన్నారు. భారీ వర్షాల వల్ల అన్నవరం, అడివి వెంకన్నగూడెం వాగులు పొంగి 40 గ్రామాలకు రాకపోకల నిలిచిపోయాయి. తృష్టి వారి గూడెం, అడివి వెంకన్న గూడెం, కన్నాయిగూడెం, శ్రీరామగిరి సీతంపేట మధ్య రాకపోకలు స్తంభించాయి.

సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలి : తహశీల్దారు

విఆర్.పురం : భారీ వర్షాలు, వరద ఉధృతి నేపథ్యంలో ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా ముందస్తుగా లోతట్టు ప్రాంతాలైన ఒడ్డుగూడెం, ఒడ్డుగూడెం కాలనీ ప్రజలతో తహశీల్దారు ఎన్.శ్రీధర్, విఆర్.పురం ఎస్ఐ దుర్గాప్రసాద్ మాట్లాడారు. గోదావరి, శబరి నదులు గురువారం నాటికి 60 అడుగులు వచ్చే అవకాశం ఉందని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సిపిఎం నేత ఐవి

ఎటపాక : ముంపు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద తాకిడి లేని చోట పునరావాసం ఏర్పాటు చేసుకోవాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఐవి బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వలన గోదావరి ముంపు ప్రాంత ప్రజలు అనేక బాధలు పడుతున్నారని, సిపిఎం ఆధ్వర్యంలో వరద బాధితలకు అండగా సహాయ సహకారాలు అందించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఎటపాక మండలం నందిగామ - మురుమూరు రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు,

విఆర్.పురం మండలం అన్నవరం వద్ద పొంగి ప్రవహిస్తున్న వాగు

ముంపు మండలాల సమస్యలపై సిఎం జగన్ స్పందించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీతారాం, చిత్రంలో జిల్లా కార్యదర్శి కిరణ్ తదితరులు

ప్రజాశక్తి- కూనవరం

నాలుగు ముంపు మండలాల సమస్యలపై ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి స్పందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. స్థానిక ఆవుల నాగమయ్య భవన్‌లో పల్లపు వెంకట్ అధ్యక్షతన బుధవారం జరిగిన నాలుగు మండలాల సిపిఎం నాయకుల సమావేశంలో సీతారాం మాట్లాడారు. ముంపు మండలాల ప్రజలు వరదల వల్ల చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం గోదావరి వరద ప్రవాహం పెరుగుతుండడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని, పునరావాస కేంద్రాలకు పరుగులు తీస్తున్నారని తెలిపారు. గోదావరి ముంపు సమస్యపై సిపిఎం పాదయాత్ర నిర్వహించి, ముందస్తుగానే రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్, అధికారుల దృష్టికి తీసుకెళ్లిందని, అయినా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ ఆరు రోజుల క్రితం గోదావరి శబరి నదులు పొంగిపోవడంతో కూనవరం, విఆర్.పురం మండలాల్లోని లోతట్టు గ్రామాల వారిని పునావాస కేంద్రాలకు తరలించి అధికారులు చేతులు దులుపుకున్నారని, వారికి నిత్యావసరాలు, బరకాలు, దోమతెరలు ఏమీ ఇవ్వకుండా గాలికొదిలేశారని తెలిపారు. గోదావరి వరద ప్రవాహం ఇంకా పెరిగే అవకాశం ఉందని, ఇప్పటికైనా అధికారులు సహాయ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. పార్టీ కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, పూనెం సత్యనారాయణ, మర్లపాటి నాగేశ్వరరావు, సీసం సురేష్, కుంజ రాధా, నాలుగు మండలాల కార్యదర్శులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భారీ వర్షానికి కుప్పకూలిన పెంకుటిల్లు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మారేడుమిల్లి గ్రామంలోని సీఎస్ఐ చర్చి వెనుక కాలువ అవతల నివాసముంటున్న గిరిజనుడు అయినమడి భీమన్న దొర పెంకుటిల్లు కుప్ప కూలింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రాణహాని జరగలేదు. ఒక్కసారిగా కుటుంబ సభ్యులందరూ భయాందోళనకు గురయ్యారు. సుమారు లక్ష రూపాయలు వరకు ఆస్తి నష్టం వాటిలిందని, ఇల్లు లేక కుటుంబం నిరాశ్రయులయ్యామని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

పెంకిటిల్లు కూలిపోయిన దృశ్యం

గంజాయి అక్రమ రవాణాపై నిఘా

ప్రజాశక్తి -సీలేరు

గంజాయి అక్రమ రవాణాను నిలువరించడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని జీకే వీధి సీఐ అశోక్ కుమార్ వెల్లడించారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ స్మగ్లర్లు ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి ఆంధ్ర మీదగా తరలిస్తున్నారని, ఈ నేపథ్యంలో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. సీలేరు పరిసర ప్రాంతాల్లో గంజాయి అక్రమ రవాణా పాల్పడిన వారిపై ఇప్పటికే అనేకమందిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించినట్లు చెప్పారు. మావోయిస్టు వారోత్సవాల్లో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మన్యంలో విస్తారంగా వర్షాలు

-వాగులు, గెడ్డలు, లోతట్టు ప్రాంతాలు జలమయం-పిడుగుపాటుకు గిరిజనుడు మృతి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు, రంపచోడవరం డివిజన్లోని ఏజెన్సీ మండలాలలో గత మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే అధికంగా నమోదవుతున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. కొన్నిచోట్ల కుండపోతగా వర్షాలు కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి.పాడేరు ఏజెన్సీలో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి, ఈనెల 24న సోమవారం జిల్లా వ్యాప్తంగా 428.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా ఒక్క చింతూరు మండలంలోనే అత్యధికంగా 146.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఈనెల 25న మంగళవారం జిల్లా వ్యాప్తంగా 316.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అల్లూరి జిల్లాకు ఒక చివరనున్న అనంతగిరి మండలంలో 52 మిల్లీమీటర్లు, ఎటపాక మండలంలో 45.6 మిల్లీమీటర్ల వర్షపాతం అత్యధికంగా నమోదయింది. జిల్లా వ్యాప్తంగా వాన జోరు పెరుగుతుండడంతో ఈనెల 26న అన్ని మండలాల్లో అత్యధికంగా వర్షపాతం నమోదయింది. రంపచోడవరం డివిజన్లో సోమవారం నుంచి వాన ఉధృతి పెరిగింది.

పొంగిప్రవహిస్తున్న మర్దగుడ, లక్ష్మీపురం గెడ్డ

గిరిజనుడు మృతి, నాలుగు ఎద్దులు మృత్యువాత

అరకులోయ రూరల్: మెరుపులతో కూడిన భారీ వర్షానికి పిడుగుపాటుకు గిరిజనుడుతో పాటు, నాలుగు దుక్కెటి ఎద్దులు మృతి చెందిన సంఘటన మండలంలోని చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని మాదల పంచాయతీ బోరిగుడ గ్రామానికి చెందిన గుబ్బాయి రాజు (50), బుదవారం పశువులను మేత కోసం గ్రామ సమీపంలో కొండపై తీసుకెళ్ళాడు. భారీ మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అదే సమయంలో పశువులు మేపుతుండగా పిడుగుపాటుకు గురై రాజుతో పాటు నాలుగు దుక్కెటి ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో ఇద్దరు కొంత దూరంలో ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు, కుటుంబ సభ్యులు రాజు మృతిపై కన్నీరు మున్నీరుగా విలపించారు.

మృతి చెందిన గిరిజనుడు

మృత్యువాత పడిన పశువులు

అనంతగిరి: మండలంలోని గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గెడ్డలు, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. శివలింగపురం, టైడా, డమ్ముకు, అనంతగిరి, బీసుపురం, సుంకరమెట్ట ప్రధాన రోడ్డులో వరద నీరు చేరింది. దీంతో, రాకపోకల ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్నారు.వాహన చోదకులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వాహనాలు నడపాల్సిన పరిస్థితి నెలకొంది.డముకు, కాశీపట్నం వారపు సంతలకు వచ్చిన వారంతా ఇబ్బందులు పడ్డారు. ఎగువ శోభ పంచాయతీ మర్దగుడగెడ్డ పొంగడంతో వరద తగు ముఖం పట్టేంత వరకు గిరిజనులు నిలిచి పోయారు.

దుంబ్రిగుడ: మండలంలో బుధవారం సాయంత్రం కొండపోత భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి వర్షం కురిసినప్పటికీ మధ్యాహ్నం మూడు గంటలకు నుంచి భారీగా కుండపోత వర్షం ఏకధాటిగా కురవడంతో మండల కేంద్రంలోని వీధి కాలువలు, రోడ్లన్నీ పూర్తిగా వర్షపు నీటితో నిండాయి. వీధి కాలువల్లో చెత్తచెదారం పేరుకు పోయి ఉండటంతో వర్షపు నీరు వెళ్లడానికి దారి లేక కాలువల్లోనే వర్షపు నీరు నిల్వ ఉండిపోతుంది. చాపరాయి, గోరాపురం గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి.

ప్రాణాలు అరచేతిలో...

ప్రజాశక్తి - అరకులోయ రూరల్: మండలంలో లోతేరు పంచాయతీ లండిగుడ గ్రామం సమీపంలో వంతెన లేక పోవటంతో వర్షకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి వరద నీటితో గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నిత్యావసర సరకులు, అత్యవసర వైద్య సేవల కోసం ప్రాణాలకు తెగించి గెడ్డను దాటాల్సి వస్తున్నదని ఆ గ్రామం వాసులు తెలిపారు. రెండు రోజులు కురిచిన భారీ వర్షానికి బుధవారం పశువులు మేతకు వెళ్ళి సాయంత్రం తీసుకొస్తుండగా గిరిజనులు ప్రాణాలు సైతం లెక్క చేయకుండా కర్రలు పట్టుకుని పశువులను దాటించారు. ఆ గ్రామ వాసులు రోజు పశువులు మేతకు, వ్యవసాయ పనులు, వివిధ పనులు నిమిత్తం నిత్యం ఈ గడ్డ దాటి వెళ్లాలి. మళ్ళీ సాయంత్రం తిరిగి వచ్చే సరికి గెడ్డ ఉధృతంగా పొంగి ప్రవహిస్తుంటుందని, దీంతో ఎమి చేయాలో అర్థం కాలేదని ప్రాణాలు అరచేతిలో పట్టుకొని గెడ్డ దాటావలసిన పరిస్థితి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గెడ్డపై వంతెన లేక పోవడంతో ఈ గ్రామాలకు 108 అంబులెన్స్ రాలేదు. నెలల నిండిన గర్భిణులు, తీవ్ర అస్వస్థతకు గురైన వారిని డోలీ సాయంతో గెడ్డ దాటించి ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వస్తుందనీ గ్రామస్తులు తెలిపారు. వాహనాలు ద్విచక్ర వాహనాలు కుడా వెళ్లలేని పరిస్థితి ఎదురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్తులు మండి పడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి లండిగుడ గెడ్డ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి వంతెన నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

కర్ర సాయంతో గెడ్డను దాటుతున్న గిరిజనులు

విజయసాయిరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆదివాసి గిరిజన సంఘం నాయకులు

బోయ/వాల్మీకిలపై పార్లమెంట్‌లో విజయసాయిరెడ్డి ప్రస్తావించడంటంతో..

ఆదివాసి గిరిజన సంఘం నిరసన

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో బుధవారం ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యుడు ఎన్.విజయసాయిరెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. రాష్ట్రంలోని బోయ/వాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్లో తీర్మానం చేసి పంపించిన ప్రతిపాదనను ఆమోదించి అమలు చేయాలని పార్లమెంట్‌లో విజయసాయి రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరడంపై ఆదివాసీ గిరిజన సంఘం నేతలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాల్‌దేవ్ మాట్లాడుతూ, బోయ/వాల్మీకుల్ని ఎస్టీ జాబితాలో చేర్చడం సరికాదని గిరిజన వర్గాలన్నీ వ్యతిరేకిస్తున్నా వైసిపి పాలకులు మొండి వైఖరితో ముందుకు వెళుతున్నారని విమర్శించారు. బోయ/వాల్మీకుల్ని గిరిజన జాబితాలో చేర్చి ఆదివాసిలకు ముప్పు తల పెడితే వైసీపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎల్.సుందర్‌రావు పాల్గొన్నారు.

పెదబయలు: బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిందని, దీనిపై కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి పెద్దలసభలో మాట్లాడటం సరికాదని సీతగుంట సర్పంచ్ పలసి మాధవరావు తెలిపారు. జిఒ 3 రద్దు చేసి గిరిజనేతరులతో పోస్టులు భర్తీ చేస్తూ గిరిజన యువత పొట్టకొట్టారన్నారు. ఆదివాసీ ప్రజలు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. విజయసాయిరెడ్డి మాటలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓట్ల రాజకీయం విడనాడాలన్నారు.

మరో మణిపూర్‌గా మారుస్తారా?

ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: బోయ/ వాల్మీకిలను గిరిజన జాబితాలో చేర్చాలని రాజ్య సభ ఎంపి విజయ్ సాయిరెడ్డి పార్లమెంట్ అడగడాన్ని తీవ్రంగా ఖండస్తున్నామని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర అన్నారు. ఈ సంద్భంగా ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడారు. బోయ/వాల్మికిలను ఎస్టీ జాబితాలో చేర్చాలని విజయ్ సాయి రెడ్డి చేసిన ప్రకటనపై అరకు ఎంపి, అరకు, పాడేరు ఎమ్మేల్యేల వైఖరి ఏమిటో ప్రకటించాలని డిమాండ్ చేశారు. బోయ/ వాల్మికిలను గిరిజన జాబితాలో చేర్చితే ఆంధ్రప్రదేశ్ కూడా మరో మణిపూర్‌గా మారుతుందన్నారు. తక్షణమే బోయ/వాల్మికిలను గిరిజన జాబితాలో చేర్చే ప్రయత్నం రద్దు చేయాలని చెప్పారు. అర్హత లేని బోయ/వాల్మికిలను గిరిజన జాబితాలో చేర్చాలని రాష్ట్ర అసంబ్లీలో తీర్మానించి వచ్చే ఎన్నికలలో రాజకీయ లబ్ది పొందేందుకు వైఎస్ఆర్ పార్టీ ప్రయత్నం చేస్తుందని విమర్శించారు.ఆదివాసీ ప్రజలు వ్యతిరేకించాలని ఆదివాసీ గిరిజన సంఘం పిలుపునిచ్చింది.

హాస్టల్‌లో చేరుతున్న గిరి విద్యార్థులు

వ్యాధులతో విద్యార్థులు సతమతం

ప్రజాశక్తి - పెదబయలు :మండల కేంద్రములో వివిధ గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో చదువు తున్న గిరి విద్యార్థులు అనారోగ్యంతో హాస్పిటల్లో చేరుతున్నారు. వర్షాకాలం కావడంతో వ్యాధుల సీజన్ ప్రారంభం అయ్యింది. మండల కేంద్రంలో కళాశాలతో పాటుగా 12 వసతిగృహాలున్నాయి. జ్వరం, తలనొప్పి, ఒళ్ళు నొప్పుల కారణంగా ఆసుపత్రికి వచ్చిన విద్యార్థులు వచ్చినట్లు ఒక విద్యార్థిని తెలిపింది. వసతి గృహంలో వర్షాల కారణంగా దోమలతో ఇబ్బంది పడుతున్నామని, పిచికారి చేయలేదని వాపోయారు. గత ఏడాది 6వ తరగతి చదువుతున్న విద్యార్థి గజ్జితో బాధపడుతూ గలగండ పంచాయతీ సరియపల్లి వెళ్లి మృతి చెందిందని విద్యార్థినిలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

పూర్తి స్థాయిలో హాజరు కాని సభ్యులు

ప్రజాశక్తి-పెదబయలు:మండపరిషత్ కార్యా యంలో బుధవారం సర్వ సభ్య సమావేశం ఎంపీపీ బోండా వరహాలమ్మ అధ్యక్షతన నిర్వహించారు. వారం రోజులకు ముందుగానే ఎంపిడీఓ ఎల్.పూర్ణయ్య సభ్యులకు సమాచారం అందించారు. ఉదయం పది గంటలకు హాజరు కావలసిన సభ్యులు ఒంటి గంటకు కూడా చేరుకోలేదు. ఐదుగురు ఎంపీటీసీ లు మాత్రమే హాజరయ్యారు. కోరం సరిపడక వాయిదా పడే అవకాశం ఏర్పడింది. కొంతమంది సభ్యులు పట్టు బట్టడంతో సమావేశం తూ తూ మాత్రంగా నిర్వహించారు. ప్రధానంగా ఉపాధ్యాయులు సమయపాలన పాటించ లేదని సభ్యులు తెలిపారు. అక్రమ కట్టడాలను అరికట్టాలని, వసతి గృహాలు, ప్రాథమిక పాఠశాల్లో పర్యవేక్షణ చేయాలని కోరారు.

వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని కితలంగి పంచాయతీ పరిశీల రోడ్డు సంపంగి గెడ్డ వంతెన నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌లు శిలాఫలకాన్ని ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వంతెన లేక పోవడంతో కితలంగి, కించుమండ పంచాయతీల గిరిజనులు రాకపోకలకు అనేక ఇబ్బందులు పడుతు న్నారన్నారు. ఈ తరుణంలో బ్రిడ్జి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ 4కోట్ల40 లక్షల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. వంతెన నిర్మాణంతో ఆ ప్రాంత గిరిజనులకు రవాణా కష్టాలు తీరుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఐటిడిఎ పిఒ అభిషేక్, ఎంపీపీ బి.ఈశ్వరి జెడ్పిటిసి సిహెచ్ జానకమ్మ, మండల వైసీపీ నాయకులు సింహాచలం, కృష్ణారావు, శ్రీరాములు, ఆయా గ్రామాల గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు నారాయణ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:ఉపాధ్యాయులు విధి నిర్వహణలో సమయపాలన తప్పకుండా పాటించాలని లోతేరు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శెట్టి నారాయణ సూచించారు. బుధవారము లోతేరు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జెవికె కిట్లు, మధ్యాహ్న భోజన పథకం వివరాలు ఆన్లైన్లో సకాలంలో అప్లోడ్ చేయాలన్నారు. తరగతి బోధనలో భాగంగా ముందుగా లెసన్ ప్లాన్‌ను తప్పకుండా తయారు చేసుకుని విద్యార్థులకు బోధించాలన్నారు.

సిపిఎం పోరాటంతో బ్రిడ్జి నిర్మాణ పనులు

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు : సిపిఎం నేతల పోరాట ఫలితంగానే మండలంలోని అతి మారుమూల లక్ష్మీపురం పంచాయతీ పరిధి బిర్రిగుడ గెడ్డలో బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారని స్థానిక సర్పంచ్ కొర్ర త్రినాథ్ తెలిపారు. బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించేందుకు పంచాయతీ సెక్రటరీ బి ప్రశాంత్‌తో పాటు స్థానిక సర్పంచ్ వెళ్లారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటాలతోనే బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వ అధికారులు స్పందించి ఎట్టకేలకు పనులు ప్రారంభించారని తెలిపారు. గతంలో అనేక సార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతులు ఇచ్చి, వివిధ రకాలుగా పోరాటం చేశామన్నారు.బ్రిడ్జి నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ చేయాలని కోరారు.కోరారు.వనుగుమ్మ పంచాయతీ రంగ బయలు, జోడిగుమ్మ గ్రామాల పరిధిలో తారు రోడ్డు నిర్మాణ పనులు నాణ్యత లేకుండా, చేయడంతో ప్రజాధనం వృథా అయ్యిందని తెలిపారు. దీని దృష్ట్యా బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారమే చేయాలన్నారు.

పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ త్రినాథ్

ఆధార్ కార్డులు జారీ చేయండి : కలెక్టర్ సుమిత్ కుమార్

ఆపరేటర్లకు ఆధార్ మొబైల్ కిట్లను అందించిన కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో మారుమూల గ్రామాల గిరిజనులకు ఆధార్ కార్డులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. విద్యా శాఖ సౌజన్యంతో కొత్తగా సరఫరా చేసిన పదిహేను ఆధార్ మొబైల్ కిట్లను బుధవారం ఆయన కార్యాలయంలో ఆధార్ మొబైల్ యూనిట్ ఆపరేటర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముందస్తుగా షెడ్యూలు వేసుకుని అనంతగిరి మండలం నుండి సీలేరు వరకు మారు మూల గ్రామాల్లో ఆధార్ మొబైల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రతీ ఒక్కరికి ఆధార్ కార్డు జారీ చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పాడేరు డివిజన్లో 34, రంపచోడవరం డివిజన్లో 11, చింతూరు డివిజన్లో 5 మొబైల్ ఆధార్ కిట్లు ఉన్నాయని పి.ఎం.యు ప్రాగ్రాం అధికారి రాంగోపాల్ జిల్లా కలెక్టర్కు వివరించారు. ఇప్పటి వరకు 35 మొబైల్ ఆధార్ కిట్లు వినియోగంలో ఉన్నాయని, కొత్తగా మరో 15 మొబైల్ ఆధార్ కిట్లు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఆపరేటర్లను ఎలా నియమిస్తున్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో బ్లూచిప్ ఐటి సొల్యూషన్స్ రీజనల్ మేనేజర్ డేవిడ్ కమలాకర్, కో ఆర్డినేటర్లు ఒ.నాగరాజు, డేవిడ్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గోతులు

పైపుల కోసం జియో తవ్వకాలు

ప్రజాశక్తి- హుకుంపేట:జీయో టవర్లు, పైపులఏర్పాటు కోసం రోడ్డు పక్కన తవ్విన గుంతలతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. మండలంలోని మారుమూల బూర్జ పంచాయతీ నుండి పట్టాం వరకు జీయో టవర్లు, పైపుల ఏర్పాటు కోసం రోడ్డు పక్కన తవ్విన గుంతలతో ప్రజలు, వాహనాదార్లు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు నత్తనడకన చేస్తుండటంతో కొంత ఆంతర్యం కలుగుతుంది. జీయో యాజమాన్యం పనులు వేగవంతంగా చేపట్టి ప్రమాదాలకు తావు లేకుండా చూడాలని బూర్జ, అనంతగిరి మండలం వేంగడ పంచాయతీల ప్రజలు కోరుతున్నారు. ఇదే రహదారిపై ప్రతి రోజు రెండు పూటలూ బస్సు నడుస్తుంని, గుంతలతో బస్సు రాకపోకలకు కూడా వీలు లేని పరిస్థితి ఉందని ప్రజలు అంటున్నారు. త్వరగా పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు మార్గంలో తవ్విన గోయ్యి

రహదారుల నిర్మాణానికి వినతి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని పోతంగి పంచాయతీ పరిధి చంపపట్టి గెడ్డ వద్ద వంతెన నిర్మించడంతో పాటు పెదపాడులో రోడ్డు, బిజమర వలస, నంది వలస గ్రామాల్లో సిసి రోడ్లు నిర్మించాలని కోరుతూ బుధవారం మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు, ఎమ్మెల్యే పాల్గుణకు టిడిపి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు టి సుబ్బారావు, టిఎన్‌టియుసి అరకు పార్లమెంట్ అధ్యక్షుడు ఏం.స్వామి, నాయకులు దన్ని రావు, కే.సుబ్బారావు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న బృందం సభ్యులు

పిహెచ్‌సిని కేంద్ర బృందం తనిఖీ

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర బృందం పర్యటనలో భాగంగా రెండో రోజు తనిఖీ చేశారు. కేంద్ర బృందం వైద్యులు నిమిత్ కుమార్ మాట్లాడుతూ, సమయానికి విధులకు హాజరు కావాలని, గ్రామాల్లోకి వెళ్లి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు.రోగులకు వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శశికాంత్, రవిచంద్రశేఖర్ పాల్గొన్నారు

'ఆంతే 2023' పోటీ పరీక్షల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

'ఆంతే 2023' పోటీ పరీక్షకు దరఖాస్తులు

ప్రజాశక్తి-కలెక్టరేట్ : జాతీయస్థాయిలో స్కాలర్ షిప్ సాధించే దిశలో నిర్వహించే ఆకాష్ నేషనల్ టాలెంట్ హంట్ (ఆంతే -2023) పోటీ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్టు సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్, బిజినెస్ హెడ్ పింకు ప్రసాద్ తెలిపారు. ద్వారకానగర్‌లోని ఆకాశ్ మెయిన్ బ్రాంచ్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా దాదాపు 20 లక్షల మంది ఈ పరీక్షకు ఏటా హాజరవుతారని తెలిపారు. అక్టోబర్ 7- 15 మధ్య ఆన్‌లైన్‌లో, అక్టోబర్ 8, 15 తేదీలలో ఆఫ్ లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులు ఎవరైనా ఈ పరీక్షకు హాజరయ్యేందుకు అర్హులని తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి 11:30 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు రెండు రోజులు ఈ పరీక్ష ఉంటుందని, మొత్తం 90 మార్కులకు గంట సమయంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విజేతలైన వారు 100 శాతం వరకు స్కాలర్ షిప్ పొందే అవకాశం ఉందన్నారు. 700 మంది విద్యార్థులకు ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు నగదు పురస్కారాలు అందిస్తామని వివరించారు. గత ఏడాది 16.5 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాసారని తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించడానికి, శిక్షణ పొందేందుకు అర్హత నిమిత్తం ఈ పరీక్ష ఆన్ లైన్, ఆఫ్ లైన్‌లో నిర్వహిస్తామన్నారు. ఫలితాలు అక్టోబర్ 27, నవంబర్ 3, 8 తేదీలలో మూడు స్థాయిల్లో ప్రకటించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఈశ్వర్ ప్రసాద్, బ్రాంచ్ మేనేజర్ రాజేష్ తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి :పోలవరం ముంపు నేపథ్యంలో దేవీపట్నం మండలంలోని సుమారు 44 గ్రామాలు ముంపునకు గురయ్యాయని, ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించాలని జనసేన మండల కన్వీనర్ చారపు వెంకటరాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొండమొదలు పంచాయితీ పరిధిలోని ఉన్న కొత్తగూడెం, కతనపల్లి గ్రామాలకు గంగవరం మండలం నేలదోసరణపాడు గ్రామ చివర్లో పునరావాస కోలనీలు నిర్మించారని, 2019 గోదావరి వరదలు కారణంగా గ్రామస్తులును ఖాళీ చేయించారని తెలిపారు. సొంత ఖర్చులతో పునరావాస కాలనీలకు తరలిరావాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందలేదని, మరికొందరికి భూ పరిహారం, ఇళ్లు కూడా నేటికి అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు

టిడిపి సమావేశం

ప్రజాశక్తి -రంపచోడవరం :తెలుగుదేశం పార్టీ రంపచోడవరం నియోజకవర్గం ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం బుధవారం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎంఎస్.రాజు, వాత్సవాయి సూర్యనారాయణ రాజు, ఎర్ర వేణుగోపాల్ రాయుడు, చిన్నం బాబు రమేష్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు ఏపి గురుకుల పాఠశాలలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి సౌమ్య విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం సీజన్ వారి వ్యాధులు పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలకు సమీపంలో ఉన్న బూసుకొన్న గ్రామాన్ని సందర్శించి ఎవరైనా జ్వరాలతో బాధపడుతున్నారా అని ఆరా తీశారు. జ్వరంతో బాధపడుతున్న గిరిజన మహిళకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు హెల్త్ సూపర్వైజర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

ప్రొక్లెయినర్‌తో ఆక్రమణల తొలగిస్తున్న అధికారులు

పజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక మెయిన్ రోడ్‌లో రహదారికి ఇరు పక్కలా ఉన్న ఆక్రమణలను స్థానిక తహశీల్దారు సుబ్రహ్మణ్య ఆచారి సమక్షంలో బుధవారం తొలగించారు. రాజవొమ్మంగి మీదుగా జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఆర్ అండ్ బి రహదారి ఆక్రమణల్లో ఉన్న కట్టడాలను తొలగించాలని ఇటీవల అధికారులు ఆదేశించారు. ఆ ఆదేశాలను కొంతమంది పట్టించుకోకపోవడంతో అధికారులు బుధవారం జెసిబి సహాయంతో తొలగించారు. ఆక్రమణలో ఉన్న కట్టడాలు తొలగించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ తహశీల్దారు అల్లి సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బూదరాళ్లలో జగనన్న సురక్ష

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని బూదరాళ్ల పంచాయతీ గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. జెడ్‌పిటిసి వారా నూకరాజు, ఎంపిపి బడుగు రమేష్ లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డౌనూరు ఎంపిటిసి బిడిజనా అప్పారావు, మండల పంచాయతీ రాజ్ శాఖ అధ్యక్షులు పొట్టిక పోతురాజు, లెగుల ప్రసాద్, ఉల్లి రామ్మూర్తి పాల్గొన్నారు.

కర్బన కాలుష్యంతో ఇంధనం తయారీ

గీతంలో ప్రఖ్యాత శాస్త్రవేత్త ప్రొఫెసర్ సూర్యప్రకాష్

సూర్యప్రకాష్‌ను అభినందిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : పరిశ్రమలు, వాహనాల నుంచి నిత్యం వెలువడే కర్బన కాలుష్యం నుంచి ఇంధనాన్ని తయారు చేసి, ప్రపంచం ఎదుర్కొంటున్న గ్రీన్‌హౌస్ వాయువుల సమస్యలకు చెక్ పెట్టవచ్చని ప్రపంచ ప్రఖ్యాత రసాయన శాస్త్రవేత్త, అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లోని లాకర్ హైడ్రోకార్బన్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ డైరక్టర్ ప్రొఫెసర్ జికె.సూర్యప్రకాష్ వెల్లడించారు. నోబెల్ బహుమతి గ్రహీతలతో మీథేన్ ఎకానమీపై ప్రఖ్యాత గ్రంథాల రచనలో పాలుపంచుకున్న ఆయన, బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'కర్బన సమస్యకు కార్బన్‌తో పరిష్కారం: మీథేన్ ఎకానమీ' అనే అంశంపై ప్రసంగించారు.

ప్రపంచ పారిశ్రామిక విప్లవం తరువాత కర్బన ఉద్గారాల శాతం క్రమేపీ పెరిగి మానవాళి మనుగడకే ముప్పుగా పరిణమించాయన్నారు. మరో వైపు సహజ వనరులను ఇంధనం కోసం వాడటం వల్ల ప్రకృతి సమతుల్యత దెబ్బతిని చమురు, వాయువనరులు అడుగంటుతున్నాయన్నారు. సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగశాతం పెరుగుతున్నా శక్తి అవసరాలను తీర్చలేదన్నారు. ఈ నేపథ్యంలో కాలుష్యకారక కార్బన్ వాయువు నుంచి ఇధన తయారు చేసే తమ పరిశోధనలు సత్ఫలితాలను ఇచ్చాయని వెల్లడించారు. నీరు, సౌరశక్తిని ఉపయోగించి కార్బన్‌డయాక్సైడ్ వాయువు నుంచి మిథనాల్‌ను తయారు చేయడం, ఇంధనంగా వాడుకోవడం గురించిన సాంకేతిక అంశాలు వివరించారు.గీతం విసి ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ విభాగం డైరక్టర్ ప్రొఫెసర్ జివిఆర్.శర్మ, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.వేదవతి పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై శాంతి ర్యాలీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి :మణిపూర్‌లో గిరిజన తెగలపై దాడులు, మహిళలపై అత్యాచారాలు, హత్యలను నిరసిస్తూ మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్ నుంచి తహశీల్దారు కార్యాలయం వరకు జోరువానలో క్రైస్తవ సంఘాలు ఈ ర్యాలీ చేపట్టాయి. అనంతరం తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు మనోహర్ రాజు, మహమ్మద్ అలీ, చంటిబాబు, ప్రేమ భూషణ్, జోసెఫ్, రుబిన్ మాట్లాడుతూ మనమంతా భారతీయులమని, మతాలు, కులాలు పేరుతో విడిపోకూడదని, అన్నదమ్ముల వలే కలిసి ఉండాలని సూచించారు. మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించాలన్నారు. మణిపూర్‌లో స్త్రీలను నగ్నంగా ఊరేగించడం అనాగరికమైన చర్య అని పేర్కొన్నారు. ఈ ఘర్షణలో 250 ప్రార్థన మందిరాలను ధ్వంసం చేశారన్నారు. అనంతరం తహశీల్దారు సుబ్రహ్మణ్య ఆచారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సాల్మన్ రాజు, గిరిజన సంఘం మండల కార్యదర్శి కె.సూరిబాబు, పెద్ద ఎత్తున మహిళలు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో ఫాస్టర్స్ ఫెలోషిప్ శాంతిర్యాలీ

నాడు-నేడుతో మరుగుదొడ్ల నిర్మాణం

ప్రజాశక్తి -సీలేరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల్లో మొదటిగా బాలికల మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా వృత్తివిద్య శాఖాధికారి అప్పల రాము పేర్కొన్నారు. సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. విద్యార్థులు యూనిట్ టెస్ట్‌లు ఏ విధంగా రాస్తున్నారో క్లాస్ రూములకు వెళ్లి స్వయంగా తనిఖీ చేశారు. కళాశాలలో నాడు నేడు పనులు ఏ మేరకు జరిగాయో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సాయినాథ్‌ను అడిగి తెలుసుకున్నారు. కళాశాల అభివృద్ధికి ఏమేమి కావాలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పనుల్లో రెండో ప్రాధాన్యత బాలుర మరుగుదొడ్లను, మూడో ప్రాధాన్యతగా మరమ్మతులకు ఇస్తున్నట్లు చెప్పారు. అల్లూరు జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నాడు-నేడు పనులకు రూ.కోటి 27 లక్షల 791 ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామర్స్ లెక్చరర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి -సీలేరు: విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై ఎపి జెన్‌కో ఎస్‌ఈ కెకెవి.ప్రశాంత్ కుమార్, ఈఈ లక్ష్మీనారాయణకు ఏపీ జెన్కో విద్యుత్ జేఏసీ సభ్యులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెఎసి చైర్మన్ వై.సత్తిబాబు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు ఈనెల 27న విద్యుత్ ఇంజనీర్లు, కార్మికులు భోజనం విరామ సమయంలో ఏపీ జెన్కో ఎస్‌ఈ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని వెల్లడించారు. ఆగస్టు 2న రిలే నిరాహార దీక్షలు చేస్తామని, 8న విజయవాడలో రాష్ట్ర జేఏసీ తలపెట్టిన మహాధర్నాకు వెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ జనరల్ జె.సత్యనారాయణ, కన్వీనర్ వై.ధరరాజు, కో-కన్వీనర్ బి.రమేష్ కుమార్ పాల్గొన్నారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు

ప్రజాశక్తి- సీలేరు :మావోయిస్టు వారోత్సవాలు ఈనెల 28 నుంచి ఆగస్టు 3 వరకు జరుగుతున్న నేపథ్యంలో జీకే వీధి సిఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం సీలేరు, దుప్పిలివాడ పంచాయతీ పరిధిలోనిసిఆర్‌పిఎఫ్, సివిల్ పోలీసులు సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు.

కనీస మద్దతు ధర చట్టబద్ధతకు పోరాటం

రైతు సదస్సులో వక్తలు

రైతు సదస్సులో మాట్లాడుతున్న అఖిల భారత అధ్యక్షులు తాన్యా

ప్రజాశక్తి-రంపచోడవరం : స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు పంట ఉత్పత్తి వ్యయానికి 50శాతం కలిపి కనీస మద్దతు ధరగా నిర్ణయించి, దానికి చట్టబద్ధత కల్పించాలని రైతు సదస్సులో వక్తలు డిమాండ్ చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కిషన్ సంయుక్త మోర్చా ఆధ్వర్యాన బుధవారం జరిగిన రైతు-కూలి సదస్సుకు ఎఐకెఎంఎస్ జిల్లా నాయకుడు పి.లచ్చిరెడ్డి అధ్యక్షత వహించగా, అఖిల భారత అధ్యక్షురాలు పి.తాన్యా, ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం నాయకులు వంజం జోగారావు, దూలన్నా, రమణ, కిరణ్‌కుమార్ మాట్లాడారు. వ్యవసాయ రంగానికి తీవ్ర హాని చేసే మూడు వ్యవసాయ చట్టాలను, విద్యుత్ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా రైతులకు క్షమాపణ చెప్పి, వారి డిమాండ్లను అంగీకరించిన ప్రధాని మోడీ ఇప్పుడు మాటతప్పారని విమర్శించారు. రైతు కూలీలకు, సన్నచిన్నకారు రైతులకు భరోసాగా నిలుస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేయడానికి పూనుకుందని తెలిపారు. అందువల్ల రైతులు, రైతుకూలీలు, కార్మికుల, మహిళలు పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెట్ల విజయ, సర్పంచ్ కె.బాలురెడ్డి, అనసూయ, పల్లాల లక్ష్మి, లక్ష్మణ్, చిలకమ్మ, జోగమ్మ పాల్గొన్నారు.

చేతబడి నెపంతో మహిళ హత్య

ప్రజాశక్తి-మారేడుమిల్లి

చేతబడి చేస్తుందనే నెపంతో ఓ గిరిజన మహిళ హత్యకు గురైన్నట్లు తెలిసింది. ఆదివారం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని చావడికోట పంచాయితీ పరిధిలోని బంధ గ్రామానికి చెందిన ఓ మహిళ చేతబడి చేస్తుందని అనుమానంతో అదే గ్రామంలోని కొంత మంది తాడుతో ఆమె గొంతు నులిమి హత్య చేసి మృతదేహాన్ని పూడ్చిపెట్టిన్నట్లు తెలిసింది. మారేడుమిల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరిస్తున్నారు. ఈ హత్యకు సంబందించి ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యుదాఘాతానికి యువకుడు మృతి

ప్రజాశకి-అడ్డతీగల :మండలంలోని భీముడు పాకలు గ్రామంలో బుధవారం ఉదయం 11 గంటలకు విద్యుత్ షాక్ తగిలి నేబుల సత్తిబాబు(29) అనే గిరిజన యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో భీముడుపాకలు గ్రామానికి చెందిన సత్తిబాబు పెంకుటిల్లు పైకప్పు నుండి వర్షం నీరు ఇంటిలోకి వస్తుంది. దానిని అరికట్టేందుకు బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో సత్తిబాబు ఇంటి పైకి ఎక్కి టార్పాలిన్ కట్టేందుకు ప్రయత్నిస్తుండగా, తన ఇంటిపైన ఉన్న విద్యుత్ సర్వీసు వైర్లు తగిలి విద్యుత్ షాక్‌కు గురై కింద పడిపోయాడు.

అతన్ని వెంటనే కుటుంబ సభ్యులు గ్రామస్తులు అడ్డతీగల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించేలోపే సత్తిబాబు మరణించినట్లు వైద్యులు సతీష్ తెలిపారు. మృతుడు సత్తిబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సత్తిబాబు మృతితో భీముడు పాకలు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అడ్డతీగల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.